05-09-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - సత్యమైన సాంగత్యము ఒక్కటే, దాని ద్వారానే మీ సద్గతి జరుగుతుంది, ఆత్మ పావనంగా అవుతుంది, మిగిలినదంతా చెడు సాంగత్యమే, అందుకే సత్సాంగత్యము తీరానికి చేరుస్తుందని, చెడు సాంగత్యము ముంచేస్తుందని అంటారు"

ప్రశ్న:- తండ్రి చేసే ఏ కర్తవ్యాన్ని ధర్మ స్థాపకులెవ్వరూ చెయ్యలేరు?

జవాబు:- అందరినీ పతితుల నుండి పావనులుగా చేసి తిరిగి ఇంటికి తీసుకువెళ్ళడమే తండ్రి కర్తవ్యము. అందరినీ ఈ శరీరాల నుండి విముక్తులుగా చేసేందుకు అనగా మృత్యువును ఇచ్చేందుకు తండ్రి వస్తారు. ఈ పనిని ధర్మస్థాపకులెవ్వరూ చెయ్యలేరు. వారి వెనుక వారి ధర్మం యొక్క పావన ఆత్మలు పై నుండి దిగుతాయి మరియు తమ-తమ పాత్రను అభినయించి పావనము నుండి పతితముగా అవుతాయి.

పాట:- మేల్కొండి ప్రేయసులారా మేల్కొండి... (జాగ్ సజనియా జాగ్...)

ఓం శాంతి. పిల్లలు పాటను విన్నారు. ఎవరు వినిపించారు? ప్రియుడు. అందరూ ప్రేయసులే, వారిని భక్తురాళ్ళు అని అంటారు. భగవంతుడు ఒక్కరే, వారినే భక్తులు తలచుకుంటారు. అందుకే వారిని ప్రియుడు అని అంటారు. భక్తులు అన్నప్పుడు అందులో పురుషులు మరియు స్త్రీలు, ఇరువురూ వస్తారు. కావున అందరూ సీతలు అయినట్లు. రాముడు ఒక్కరే. భక్తులు అనేకులు, భగవంతుడు ఒక్కరే. ఆ భగవంతుడిని పరమపిత అని అంటారు. లౌకిక తండ్రిని పరమపిత అని అనరు. అతను లౌకిక శరీరాన్ని ఇచ్చే తండ్రి. పరమపిత పరంధామంలో నివసిస్తారు, వారు ఆత్మలందరికీ తండ్రి. మనుష్యులు ప్రతి ఒక్కరికీ ఇద్దరు తండ్రులు ఉంటారు - ఒకరు లౌకిక తండ్రి, ఇంకొకరు పారలౌకిక తండ్రి. లౌకిక తండ్రి వారసత్వము ప్రతి జన్మలోనూ వేరుగా ఉంటుంది. ప్రతి జన్మలోనూ తండ్రులు వేరు-వేరుగా ఉంటారు. మీరు ఆలోచించండి - ఎన్ని జన్మలు తీసుకుంటారు, ఎంతమంది తండ్రులు లభిస్తూ ఉండవచ్చు? (84) అవును, 84 జన్మలలో తప్పకుండా 84 మంది తండ్రులు వరియు 84 మంది తల్లులు లభిస్తారు. ప్రతి జన్మలో ఒకే ఒక్క లౌకిక తండ్రి మరియు ఒకే ఒక్క తల్లి ఉంటారు. మరొక తండ్రి పరమపిత పరమాత్మ. కానీ సత్య, త్రేతాయుగాలలో ఎప్పుడూ - ఓ గాడ్ ఫాదర్ అంటూ తలచుకోరు. ఓ పరమపిత పరమాత్మా, దయ చూపించండి - ఎప్పుడూ ఇలా అనరు. అందుకే సత్య, త్రేతాయుగాలలో ఒకే తండ్రి ఉంటారు అని అర్థం చేయించడం జరుగుతుంది. ఆ తర్వాత ద్వాపర, కలియుగాలు, వేటినైతే భక్తి మార్గము అంటారో, అక్కడ అందరికీ ఇద్దరు తండ్రులు ఉంటారు. స్త్రీ-పురుషులందరికీ ఇద్దరు తండ్రులు ఉంటారు. పారలౌకిక తండ్రిని తలచుకుంటారు ఎందుకంటే ఇది దుఃఖధామము. దుఃఖధామంలో ఇద్దరు తండ్రులు, సుఖధామంలో ఒక్క తండ్రి ఉంటారు. ఇక్కడ ఒకరేమో లౌకిక తండ్రి, ఇంకొకరు అందరి దుఃఖాలనూ నివారణ చేసే తండ్రి. ఈ దుఃఖం నుండి విడిపించండి, దయ చూపించండి అని అందరూ వారిని తలచుకుంటారు. అర్ధకల్పము దుఃఖధామము, అర్ధకల్పము సుఖధామము. సత్యయుగము కొత్త యుగము, కలియుగము పాత యుగము. తండ్రి అంటారు, ఇప్పుడు నేను కొత్త ప్రపంచమైన సత్యయుగాన్ని స్థాపన చేస్తున్నాను. పాత యుగమైన కలియుగము యొక్క వినాశనం జరుగనున్నది. కలియుగం తర్వాత మళ్ళీ సత్యయుగము రానున్నది. కలియుగాంతము మరియు సత్యయుగ ఆదిని కల్పము యొక్క సంగమము అని అంటారు. ఇది కళ్యాణకారీ యుగము ఎందుకంటే ఇక్కడ పతితుల నుండి పావనులుగా అవ్వవలసి ఉంటుంది. కలియుగంలో పతిత మనుష్యులు ఉంటారు, సత్యయుగంలో పావన దేవతలు ఉంటారు. తండ్రి అర్థం చేయిస్తారు, ఇది అసురీ రావణ సంప్రదాయము. ప్రతి ఒక్కరిలో ఐదు వికారాలు ప్రవేశించి ఉన్నాయి. అందుకే రావణుడు సర్వవ్యాపి, అంతేకానీ భగవంతుడు సర్వవ్యాపి కాదు అని అంటారు. ఇక్కడ పంచ వికారాలు ప్రవేశించి ఉన్నాయి, అందుకే దీనిని పతిత ప్రపంచము అని అంటారు. సత్య, త్రేతాయుగాలను పావన ప్రపంచము అని, శివాలయము అని అంటారు. కలియుగము వేశ్యాలయము. కావున పరమపిత పరమాత్మ శివుడు వచ్చి కొత్త యుగాన్ని స్థాపన చేస్తారు. తండ్రి అర్థం చేయిస్తున్నారు, ఇప్పుడు మేల్కొండి, నవయుగం మరియు సుఖధామము యొక్క సమయం ఇప్పుడు వచ్చింది. లక్ష్మీ-నారాయణుల రాజ్యము వస్తోంది. ఇది రాజయోగము. ఇది సామాన్యమైన సత్సంగమేమీ కాదు. ఒకటేమో, సత్సాంగత్యము, ఇంకొకటి అసత్య సాంగత్యము అనగా చెడు సాంగత్యము. సత్యమైన సాంగత్యము తీరానికి చేరుస్తుంది, చెడు సాంగత్యము ముంచేస్తుంది. సత్యమైనవారు ఒక్క తండ్రియే. వారిని పతిత-పావనా రండి అని పిలుస్తారు. వారే వచ్చి అర్ధకల్పము కొరకు పావనంగా తయారుచేస్తారు. మళ్ళీ మాయా రావణుడు వచ్చి అర్ధకల్పము పతితముగా చేస్తాడు. తండ్రి పతితముగా చేస్తారని కాదు. ఇప్పుడు ఇది రావణ రాజ్యము. ఎప్పటివరకైతే సత్యమైన తండ్రి రారో అప్పటివరకూ సత్సంగము ఉండదు.

అంతా అసత్యమైన సాంగత్యము లేక చెడు సాంగత్యమే. మీరు సీతలు, మీరు భక్తి చేస్తారు. భక్తి ఫలాన్ని భగవంతుడు వచ్చి ఇస్తారు అని భావిస్తారు. కావున తప్పకుండా భక్తి సమయము ఎప్పుడైతే సమాప్తమవ్వవలసి ఉంటుందో, అప్పుడే వారు వస్తారు కదా. అర్ధకల్పము జ్ఞాన ప్రారబ్ధము మరియు అర్ధకల్పము భక్తి ప్రారబ్ధము. ఇప్పుడు మీరు భగవంతుని శ్రీమతం అనుసారంగా పురుషార్థం చేస్తున్నారు. భగవంతుడు ఒక్కరే ఉంటారు, వారే నిరాకార పరమపిత పరమాత్మ, ఆత్మల తండ్రి. వారు సంగమయుగంలోనే వస్తారు. ద్వాపర-కలియుగాలను భక్తి కాండము అని అంటారు. సత్య-త్రేతాయుగాలను జ్ఞాన కాండము అని అంటారు. జ్ఞాన సాగరుడైన పరమపిత పరమాత్మ వద్దే జ్ఞానము ఉంది. శాస్త్రాలలోని జ్ఞానము జ్ఞానమేమీ కాదు. ఒకవేళ వాటిలో జ్ఞానమున్నట్లయితే మరి సద్గతి లభించేది. ఏ భారత్ అయితే వజ్రతుల్యంగా ఉండేదో, అది ఇప్పుడు అలా లేదు. మళ్ళీ తండ్రి ఆ విధంగా తయారుచేస్తారు. ఇప్పుడు మీరు వజ్రంవలె తయారవుతున్నారు. మీ జీవితము పరివర్తన అవుతోంది. ఆత్మ దైవీ గుణాలను ధారణ చేస్తోంది. మామూలుగా అయితే మనుష్యులు బ్యారిస్టర్, ఇంజనీర్, సర్జన్ మొదలైనవారిగా అవుతారు. కానీ మనుష్యులను దేవతలుగా తయారుచేయడమనేది జ్ఞాన సాగరుడైన పరమపిత పరమాత్మని కర్తవ్యమే. వారినే సత్యము అని అంటారు. వారే సత్యాన్ని తెలియజేస్తారు అనగా సత్య ఖండాన్ని స్థాపన చేస్తారు. మిగిలినవారంతా అసత్యం చెప్పేవారు. వారు అసత్య ఖండాన్ని స్థాపన చేస్తారు, రావణుని మతముపై నడుస్తారు. మీరు శ్రీమతం ద్వారా శ్రేష్ఠముగా అవుతారు. కొత్తయుగంలో భారత్ కొత్తగా ఉండేది. దానిని సర్వశక్తివంతమైన రాజ్యము అని అంటారు. లక్ష్మీ-నారాయణుల రాజ్యము ఉండేది. వారికి ఆ రాజ్య భాగ్యాన్ని ఎవరు ఇచ్చారు? తప్పకుండా ఎవరైతే స్వర్గాన్ని స్థాపన చేసారో వారే ఇచ్చి ఉంటారు. 84 జన్మలు తీసుకొని ఇప్పుడు ఆ వారసత్వాన్ని పోగొట్టుకున్నారు. ఇప్పుడిక చక్రము పూర్తవుతుంది. అందరూ తిరిగి వెళ్ళాలి. ముక్తిప్రదాత ఒక్క తండ్రియే. వారే విముక్తులుగా చేసి అందరినీ తీసుకువెళ్తారు, అందుకే వారిని కాలుడికే కాలుడు అని అంటారు. తండ్రి అంటారు, ఇప్పుడు మీ 84 జన్మలు పూర్తయ్యాయి. ఇప్పుడు తిరిగి వెళ్ళాలి. ఈ సృష్టి చక్రము ఎలా తిరుగుతుంది అనేది తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు అనగా త్రికాలదర్శులుగా చేస్తారు. మూడు లోకాల, మూడు కాలాల జ్ఞానాన్ని ఇస్తారు. వారే పతిత-పావనుడు, జ్ఞానసాగరుడు, బీజరూపుడు. వారి ద్వారానే మీకు సత్యఖండపు వారసత్వము లభిస్తుంది. పరమపిత పరమాత్మ ఎవరైతే స్వర్గ స్థాపన చేస్తారో వారి నుండి వారసత్వాన్ని తీసుకునేందుకు మీరు ఇక్కడకు వచ్చారు. మళ్ళీ మనమే స్వర్గానికి యజమానులుగా అవుతామని మీకు తెలుసు. సత్యయుగంలోని లక్ష్మీ-నారాయణులు మొదలైనవారిని దైవీ ధర్మము వారు అని అంటారు, అది శ్రేష్ఠమైన ధర్మము. వారి ధర్మము కూడా శ్రేష్ఠమైనదే, అలాగే వారి కర్మ కూడా శ్రేష్ఠమైనదే. అక్కడ భ్రష్టాచారులెవ్వరూ ఉండరు. అలాగే ద్వాపర-కలియుగాలలో శ్రేష్ఠాచారులెవ్వరూ ఉండరు. తండ్రిని మర్చిపోయిన కారణంగానే దుర్గతి ఏర్పడుతుంది. మళ్ళీ తండ్రి వచ్చి పతితుల నుండి పావనులుగా తయారుచేస్తారు. ధర్మ స్థాపకులెవ్వరూ పతితుల నుండి పావనులుగా తయారుచేసేందుకు రారు. పతిత-పావనుడైతే ఒక్క తండ్రియే. వారే సత్యమైన సద్గురువు. ఇకపోతే ధర్మ స్థాపకులు వచ్చి తమ ధర్మాన్ని స్థాపన చేస్తారు. పైనుండి పావన ఆత్మలు వస్తాయి, తర్వాత పతితముగా అవుతాయి. ఈ సమయంలో అందరూ పతితులుగా ఉన్నారు. అందరినీ పావనంగా చేయడం ఒక్క తండ్రి పనే. వారే పతిత-పావనుడు. గురునానక్ కూడా ఆ సద్గురువు మహిమను చేసారు. ఈ పాత ప్రపంచపు వినాశనం కొరకే ఈ మహాభారత యుద్ధము ఉంది. అంతేకానీ మీకు యుద్ధ మైదానంలో జ్ఞానము ఇస్తారనేమీ కాదు. జ్ఞానము కొరకు ఏకాంతము కావాలి. 7 రోజులు భట్టీలో ఉండవలసి ఉంటుంది. మిగిలినదంతా భక్తి సామాగ్రి. భక్తులలో కూడా కొందరు చాలా చురుకైనవారు ఉంటారు. రుద్ర మాల కూడా ఉంది, అలాగే భక్త మాల కూడా ఉంది. అది భక్తుల మాల, ఇది జ్ఞాన మాల. పైన శివుడు ఉంటారు, ఆ తర్వాత జంట పూసలు ఉంటాయి, ఆ తర్వాత వారి వంశావళి, ఈ మాలను మనుష్యులు స్మరిస్తారు. రామ-రామ అంటూ ఉంటారు ఎందుకంటే దుఃఖితులుగా ఉన్నారు. మీరు వచ్చి మీ వారిగా చేసుకోండి అని రావణ సాంప్రదాయులు రాముడిని తలచుకుంటారు. ఇప్పుడు మీరు ఈశ్వరీయ ఒడిలోకి వచ్చారు. వాస్తవానికి ఆత్మలందరూ పరమపిత పరమాత్మని సంతానము. మనుష్య సృష్టి ప్రజాపిత బ్రహ్మకు సంతానము. ప్రజాపిత బ్రహ్మ ద్వారా మనుష్య సృష్టిని రచించారు. ఆత్మ అవినాశీ. ఆత్మలకు అవినాశీ తండ్రి ఉన్నారు. ఇప్పుడు మీకు ఇద్దరు తండ్రులు ఉన్నారు - ఒకరు వినాశీ తండ్రి, ఇంకొకరు అవినాశీ తండ్రి. బ్రహ్మ కూడా శరీరాన్ని వదిలేస్తారు. శివబాబాకైతే తమదంటూ శరీరమే లేదు. వారు జనన-మరణ రహితుడు. జనన-మరణాలలోకి పిల్లలైన మీరే వస్తారు. ఆది సనాతన దేవీ-దేవతా ధర్మానికి చెందిన మీకే 84 జన్మలు ఉన్నాయి. లెక్క ఉంది కదా. గురునానక్ వచ్చి 500 సంవత్సరాలవుతోంది. మరి ఇంతలోనే 84 జన్మలు ఎలా తీసుకుంటారు. ఇక లక్షల జన్మల యొక్క ప్రసక్తే లేదు. ఇప్పుడు అందరి జన్మలూ పూర్తయ్యాయి అని తండ్రి అర్థం చేయిస్తున్నారు. మళ్ళీ కొత్తగా సత్యయుగం నుండి ఆట ప్రారంభమవుతుంది. సత్యయుగంలో కొద్దిమందే కావాలి. మరి మిగిలినవారందరూ ఎక్కడికి వెళ్తారు? వారి కొరకే ఈ ప్రపంచానికి నిప్పు అంటుకోనున్నది. ఈ బాంబులు మరియు ప్రకృతి వైపరీత్యాలు మొదలైనవాటి ద్వారా అంతా అంతమైపోతుంది. ఇకపోతే ఆత్మలన్నీ

ముక్తిధామానికి వెళ్ళిపోతాయి. ఇది వినాశన సమయము, అందరూ తిరిగి వెళ్ళాలి. భారత్ ను అవినాశీ ఖండము అని అంటారు ఎందుకంటే భారత్ యే తండ్రి జన్మ స్థానము. శివబాబా భారత్ లోనే వస్తారు. పతిత-పావనుడైన తండ్రి ఇక్కడే జన్మ తీసుకుంటారు కావున అన్ని ధర్మాల వారికి భారత్ అన్నింటికన్నా గొప్ప తీర్థ స్థానము. భారత్ కు ఇంతటి మహత్వముంది కానీ ఆ మహత్వాన్ని పోగొట్టేసారు. ఇది కూడా డ్రామా ఆట, దీనిని తండ్రే వచ్చి అర్థం చేయిస్తారు. తండ్రి అంటారు, నేనే జ్ఞాన సాగరుడను. లక్ష్మీ-నారాయణులను జ్ఞాన సాగరులు అని అనరు. వారిలో రచయిత మరియు రచనల ఆదిమధ్యాంతాల జ్ఞానము లేదు.

ఆ జ్ఞానము మీలో తప్పకుండా ఉంది. మీరే మనుష్యుల నుండి దేవతలుగా అవుతారు. పతితులు నుండి పావనులుగా అయి పావన ప్రపంచానికి యజమానులుగా అయ్యేందుకు మీరు ఇక్కడకు వస్తారు. తండ్రి కూర్చొని ఆత్మలతో మాట్లాడుతారు. నిరాకారుడైన తండ్రి వీరి ఇంద్రియాలను అద్దెకు తీసుకుని చదివిస్తారు. మీ ఆత్మ కూడా ఈ ఇంద్రియాల ద్వారా వింటుంది. బాబా అర్థం చేయించారు - ఆత్మ నక్షత్రము వంటిది, అది భృకుటి మధ్యలో ఉంటుంది మరియు ఆ తండ్రి ఉన్నతోన్నతమైన ఆత్మ. ఆ ఉన్నతోన్నతమైనవారు వచ్చి వీరిని తమ సమానంగా ఉన్నతోన్నతంగా తయారుచేసి తమతోపాటు తీసుకువెళ్తారు. వారు ఆత్మలందరికీ మార్గదర్శకుడు. వారినే దుఃఖహర్త, సుఖకర్త అని అంటారు. దుఃఖము నుండి మిమ్మల్ని విముక్తులుగా చేసి తీసుకువెళ్తారు. సత్యయుగంలో దుఃఖము ఉండదు. కొత్త యుగానికి సంబంధించిన జ్ఞానము కూడా కొత్తదే కదా. ఈ విషయాలను మనుష్యులు ఎప్పుడూ వినలేదు. మనుష్యులలో మంచివారు, చెడ్డవారు ఉన్నా కానీ అందరూ పతితులే, అందుకే గంగా నది వద్దకు స్నానాలు చేయడానికి, పావనులుగా అవ్వడానికి వెళ్తారు. గంగకు పతిత-పావని అన్న పేరును పెట్టారు. వాస్తవానికి పతిత-పావనుడు అని తండ్రినే అంటారు. పతిత ప్రపంచం తర్వాత, మళ్ళీ పావన ప్రపంచ స్థాపన జరుగుతుంది. సత్యయుగాన్ని నిర్వికారీ ప్రపంచము అని అంటారు. అదేమో సైలెన్స్ నిరాకారీ ప్రపంచము. ఆత్మలు ఇక్కడికి వచ్చి పాత్రను అభినయిస్తాయి. 84 జన్మల పాత్ర ఉంది. మీరు ఆల్రౌండ్ పాత్రను అభినయిస్తారు. ఇది తయారై-తయారుచేయబడిన డ్రామా. ప్రతి ఒక్కరిలో తమ-తమ పాత్ర అవినాశీగా ఉంది. అది ఎప్పుడూ చెరగదు. మీరు 84 జన్మలను అనుభవిస్తూ ఉంటారు. చక్రానికి ఆది, అంతము లేవు. డ్రామా ఎప్పుడు ప్రారంభమయ్యింది - ఈ ప్రశ్నే తలెత్తదు. దానికి ఆదీ లేదు, అంతమూ లేదు. సత్యయుగ ఆదికాలము సత్యతో నిండిన యుగము, ఇది సత్యము మరియు ఈ సత్యము మళ్ళీ నిరూపించబడుతుంది. ఈ చక్రాన్ని అర్థం చేసుకోవడం ద్వారా మీరు స్వర్గానికి చక్రవర్తీ మహారాజు, మహారాణిగా అవుతారు. దానిని సర్వశక్తివంతమైన రాజ్యము అని అంటారు, ఇది సర్వశక్తివంతుడైన తండ్రి ద్వారా లభిస్తుంది. మీరు అనంతమైన తండ్రి నుండి 21 తరాల కొరకు సదా సుఖ వారసత్వాన్ని పొందుతారు. తండ్రిని హెవెన్లీ గాడ్ ఫాదర్ అని అంటారు. స్వర్గ వారసత్వాన్ని ఇచ్చే తండ్రి చెప్తున్నారు - నేను కల్పపు సంగమయుగంలో వచ్చి స్వర్గ వారసత్వాన్ని ఇస్తాను. ఎవరైతే పురుషార్థం చేస్తారో వారు సూర్యవంశీ రాజ్యంలోకి వస్తారు. ఇది సాధారణ సత్సంగమేమీ కాదు. ఇది ఈశ్వరీయ విశ్వవిద్యాలయము. భగవానువాచ కదా. భగవంతుడు చదివించి మనుష్యులను దేవతలుగా తయారుచేస్తారు. మేము మనుష్యుల నుండి దేవతలుగా తయారుచేస్తాము అని చెప్పే సత్సంగము ఇంకేదీ ఉండదు.

ఇప్పుడు పిల్లలైన మీరు కొత్త ప్రపంచములో దేవీ-దేవతా పదవిని పొందేందుకు పురుషార్థం చేస్తున్నారు. ఇలా అర్థం చేయించాలి - ఇద్దరు తండ్రులు ఉంటారు, ఒకరు అనంతమైన తండ్రి, ఇంకొకరు హద్దు తండ్రి, మేము అనంతమైన తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకుంటున్నాము, మీకు కూడా వారి నుండి వారసత్వాన్ని తీసుకోండి అని సలహా ఇస్తున్నాము. శ్రేష్ఠాతి-శ్రేష్ఠమైన పరమపిత పరమాత్ముని మతంపై నడవడం ద్వారా మీరు స్వర్గాధిపతులుగా అవుతారు. సత్యమైనవారు ఒక్క తండ్రియే. వారు వచ్చి చదివిస్తారు. బ్రహ్మ తనువు ద్వారా బ్రహ్మాముఖవంశావళికి వారసత్వాన్ని ఇస్తాను అని వీరి ఇంద్రియాల ద్వారా చెప్తారు. బ్రహ్మ ద్వారా మీకు తాతగారి వారసత్వం లభిస్తుంది. తాతగారి వారసత్వంపై సర్వాత్మలకు హక్కు ఉంది. లౌకిక సంబంధాలలో కేవలం పురుషులకు మాత్రమే వారసత్వం లభిస్తుంది. మీరైతే ఆత్మలు. అందరూ సోదరులవుతారు. అందరికీ శివబాబా నుండి వారసత్వం లభిస్తుంది. మీకు తాతగారి నుండి వారసత్వం లభిస్తూ ఉంది.

తండ్రి అంటారు - నేను మిమ్మల్ని మందిర యోగ్యంగా తయారుచేస్తాను. మనుష్యులలో క్రోధము ఎంతగా ఉందో చూడండి. ఒకరినొకరు వినాశనం చేసుకుంటారు. ఇది వేశ్యాలయము. ఒకప్పుడు శివాలయంగా ఉండేది, మళ్ళీ ఇప్పుడు అలా తయారవ్వనున్నది. పరమపిత పరమాత్మ శివుడు వచ్చి శివాలయాన్ని తయారుచేస్తారు. వేశ్యాలయం

నుండి విముక్తులుగా చేసి, మార్గదర్శకునిగా అయి అందరినీ తిరిగి శివాలయంలోకి తీసుకువెళ్తారు. అందరూ తమ పాత శరీరాల నుండి ముక్తులుగా అయి నాతో పాటు వస్తారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. దైవీ గుణాలను ధారణ చేసి స్వయం యొక్క జీవితాన్ని పరివర్తన చేసుకోవాలి. సత్యఖండంలోకి వెళ్ళేందుకు సత్యమైన తండ్రితో సత్యంగా ఉండాలి.

2. ఒక్క సత్యమైన తండ్రి సాంగత్యములో ఉండాలి, మనుష్యుల నుండి దేవతలుగా తయారుచేసే చదువును బాగా చదువుకుని అనంతమైన వారసత్వాన్ని తీసుకోవాలి.

వరదానము:- ప్రతి ఒక్కరి స్వభావ-సంస్కారాలను తెలుసుకుని, ఘర్షణ పడేందుకు బదులుగా సురక్షితంగా ఉండే మాస్టర్ నాలెడ్జ్ ఫుల్ భవ

ఏ విషయమునైనా చిన్నదిగా లేక పెద్దదిగా చెయ్యటము - ఇది మన బుద్ధిపై ఆధారపడి ఉంటుంది. ఇతరుల స్వభావ-సంస్కారాల గురించి తెలుసుకున్నారు, మరి నాలెడ్జ్ ఫుల్ అయినవారు ఎప్పుడూ ఎవరి స్వభావ-సంస్కారాలతో ఘర్షణ పడరు. ఇక్కడ గొయ్యి ఉంది లేక ఇక్కడ పర్వతము ఉంది అని ఎవరికైనా తెలిసి ఉంటే వారు ఎప్పుడూ దానితో ఢీకొనరు, పక్కకు వచ్చేస్తారు. అలా మీరు కూడా పక్కకు వచ్చేయండి అనగా మిమ్మల్ని మీరు సురక్షితంగా ఉంచుకోండి. పని నుండీ పక్కకు వచ్చేయకండి, కానీ మీ రక్షణా శక్తి ద్వారా ఇతరులను కూడా సురక్షితం చెయ్యండి - పక్కకు వచ్చేయడం అంటే ఇదే.

స్లోగన్:- ఎగిరే కళను అనుభవము చెయ్యాలంటే సదా భాగ్యము మరియు భాగ్యవిధాత యొక్క స్మృతిలో ఉండండి.